
సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 26 మందికి రూ.11,24,543 మంజూరయ్యింది. ఈ చెక్కులను మండపేట టిడిపి కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు ఒక వరమని, పేద కుటుంబాలకు ఈ సహాయం ద్వారా తమ కష్టాల నుంచి కొంత ఉపమనం పొందు తున్నారనిఅన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డు, గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెక్కుల అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

కౌలు రైతుకు మొండిచేయి

- ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం భూ యజమానుల ఖాతాలో జమ
- కౌలు కార్డులు మంజూరు కాక తీవ్రంగా నష్టపోతున్న కౌలుదారులు

ప్రజాశక్తి - రాజోలు

వ్యవసాయంపై మక్కువ ఉండి సాగు చేయడానికి సొంత భూమిలేని ఎందరో కౌలు రైతులను వరుణుడు నిండా ముంచేశాడు. బతుకుదెరువు కోసం పొలాలు కౌలు తీసుకొని రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు రాత్రి రాత్రికి తుపాను ధాటికి దెబ్బతిన్నాయి. చేసిన శ్రమ, పెట్టిన పెట్టుబడి మొత్తం కష్టార్పణమైంది. తిరిగి మళ్లీ సాగు చేయాలంటే మరోసారి అప్పు తేవాల్సిన దుస్థితి. ప్రభుత్వం ఇప్పటి వరకు తుఫాన్తో నష్టపోయిన రైతులను ఏవిధంగా ఆదుకుంటుందో చెప్పలేదు. ఇచ్చినా ఆ సాయం రైతుకు వెళుతుంది, మరి మా పరిస్థితి ఏంటని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కౌలు రైతుల కష్టాన్ని అర్థం చేసుకొని నష్టపోకుండా చూడాలని కోరుతున్నారు.

జిల్లాలో తుపాను వల్ల నష్టపోయిన మొత్తం రైతులు 75వేల మంది ఉండగా, అందులో కౌలు రైతులు సుమారు 40 వేల మంది ఉంటారని అధికారుల అంచనా. అయితే వీరిని ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో తెలపడం లేదు. సాగుచేసే వారినే రైతులుగా గుర్తించి నష్టపరిహారం అందించాలని కౌలు రైతుల సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అక్టోబర్లో ఇస్తామన్న అన్నదాత సుఖీభవ ఇప్పటికీ వేయలేదని, దాన్ని సాగులో ఉన్న కౌలు రైతులకు ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు జిల్లాలో సుమారు 80వేల మంది కౌలు రైతులు ఉండగా కనీసం 30 వేల మందికి కూడా కౌలురైతు కార్డులు అందజేయకపోవడం అన్యాయమంటున్నారు.



ఇటీవల సంభవించిన మొంథా తుపాను ధాటికి నేలనంటిన వరిచేలు

కౌలు దారులు నష్టాల పాలు

కౌలు సాగు చేసేవారిలో అత్యధికంగా ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ వర్గాలే ఎక్కువ. జిల్లాలో భారీ వర్షాల పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు 1.63 లక్షల ఎకరాల్లో సాగు చేసిన 55,000 మంది రైతులకు చెందిన పంటలు తుపాను దాటికి నష్టం వాటిల్లింది. సుమారు రూ.200కోట్ల వరకు నష్టపోయారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఏవిధమైన సాయం అందిస్తోంది ప్రకటించలేదు. అఅధికారులు నష్ట వివరాలు నమోదు చేస్తున్నారు. ఇందులో 33 శాతం కన్నా ఎక్కువ పంట నష్టపోతేనే రైతుకు నష్టపరిహారం వస్తుందనే మెలిక పెట్టి, చాలా మందిని అనర్హులుగా ప్రకటించే కుట్ర చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

రెట్టింపైన పెట్టుబడులు:

గడిచిన రెండు సంవత్సరాలతో పోలిస్తే వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపయ్యాయి. డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో వ్యవసాయ రంగంపై దీని ప్రభావం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. రెండు సంవత్సరాలు క్రితం ఒక ఎకరం పొలంలో వరిసాగు చెయ్యాలంటే రూ.20 వేల నుంచి రూ.22వేల వరకు పెట్టుబడులు పెట్టేవారు. ప్రస్తుతం ఎరువుల ధరలు, ట్రాక్టర్ అద్దెలు, పురుగు మందులు ధరలు, కూలీలకు ఇచ్చే కూలిరేట్లు పెరగడం వల్ల ఒక ఎకరా వరిసాగుకు రూ.29 వేల నుంచి రూ.30 వేల వరకూ వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో ట్రాక్టర్ గంట సేపు దున్నడానికి రూ.800 తీసుకునేవారు. ప్రస్తుతం డీజిల్ రేట్లు పెరగడంతో గంటకు రూ.1100 నుంచి రూ.1200 తీసుకొంటున్నారు. రెండేళ్ల క్రితం కంటే ఇప్పుడు డిఎపి, గ్రోమోర్ 28-28-0, పోటాష్ వంటి ఎరువులపై ఒక్క బస్తాకు రూ.200 నుండి రూ.300 వరకు పెరగడంతో పాటు కూలీలా రేట్లు పెరగడంతో పెట్టుబడులు అధికమ వుతున్నాయి. ఎకరం పొలంలో వరి పంట బాగా పండితే 22 క్వింటాలు ధాన్యం దిగు బడులు వస్తాయి. ప్రభుత్వం ఆదేశాలు మేరకు మిల్లర్లు ధాన్యం గ్రేడింగ్ నిర్ణయించి ధర నిర్ణయిస్తారు.

వరి నష్టం వివరాలు..

జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే మొంథా తుపాను ధాటికి 77,560 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. తుపాను కారణంగా 55,000 మంది రైతులు నష్టపోయారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - మండపేట

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అధికారులు, మిల్లర్లతో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను సమన్వయంతో నిర్వహించాలని అన్నారు. బుధవారం ఏడిద గ్రామ పంచాయతీ రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లయిస్ ఛైర్మన్ తోట సుధీర్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారి వ్యవస్థలను అరికడుతూ రైతుకు న్యాయం చేకూర్చాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రియల్ టైమ్ గవర్నెర్స్ ద్వారా పర్యవే క్షిస్తున్నామని అన్నారు. రైతులు నచ్చిన మిల్లర్లకు ధాన్యం విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. ధాన్యం విక్రయించిన 24 నుంచి 48 గంటలలోపే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు సిద్ధమైన జిల్లా యంత్రాంగం పలు జాగ్రత్తలు తీసుకుందన్నారు. రైతు లకు ఇబ్బందులు లేకుండా ఈ ఏడాది ధాన్యం కొను గోలు కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఎంఎల్ఎ వేగుళ్ల మాట్లాడుతూ రైతులు తమకు నచ్చిన మిల్లుకు, నచ్చిన సమయంలో ధాన్యం విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. రైతులు సులభంగా వాట్సాపలో హాయ్ పంపడం ద్వారా ధాన్యం విక్రయ ప్రక్రియలో చేరే సౌకర్యాన్ని కల్పించారన్నారు. ధాన్యం సేకరణలో జిల్లాను నెంబర్ వన్ స్థానంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. సివిల్ సప్లయిస్ ఛైర్మన్ తోట సుధీర్ ప్రసంగిస్తూ రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సకల ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్‌డిఒ డి.అఖిల, జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పి. శ్రీనివాస్, మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు, నల్లమిల్లి వీర్రెడ్డి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

రవికుమార్ దీక్ష భగ్నం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమెల్లి రవికుమార్ చేపట్టిన నిరవధిక దీక్షను పోలీసులు బుధవారం పోలీసులు భగ్నం చేశారు. నగర పంచాయతీ పరిధిలో స్థానిక సమైక్యాంధ్ర శిబిరం వద్ద మంగళవారం సాయంత్రం నంచి రవికుమార్ ఆమరణ దీక్ష చేపట్టారు. ఆయనకు బుధవారం ఉదయం పోలీసుల సమక్షంలో కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యులు పృథ్వీ సమక్షంలో వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయనకు బిపి లెవెల్స్ పూర్తిగా పడిపోయి ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో వైద్యులు సూచన మేరకుర దీక్షను పోలీసులు భగ్నం చేశారు. వైద్యుల సూచన మేరకు రవికుమార్‌ను 108లో ఆసుపత్రికి తరలించారు. దీక్షను భగ్నం చేసే సమయంలో కార్యకర్తలు అడ్డుకుని తీవ్రంగా ప్రతిఘటించారు. రవికుమార్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. ఆసుపత్రికి తరలించినప్పటికీ రవికుమార్ వైద్యానికి సహకరించకుండా దీక్షను కొనసాగిస్తున్నారు. బస్టాండ్ పునరుద్ధరించే వరకు దీక్ష కొనసాగుతుందని, అవసరమైతే ప్రాణత్యాగానికి వెనుకాడనని ప్రతినబూనారు. వైద్యులు సమయ స్ఫూర్తితో ఆయనకు వైద్యం అందిస్తున్నారు.



రవికుమార్ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న వైద్య బృందం

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు జి.దైవకృష డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో అత్యాచార ఘటనపై నిరసన తెలిపారు. అనంతరం బాలికల సంరక్షణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దైవకృష మాట్లాడుతూ సభ్య సమాజం తలవంచుకునే విధంగా ఐ.పోలవరం మండలానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన రాయపురెడ్డి సత్య వెంకటన కృష్ణ అలియాస్ బాబీని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని, మళ్లీ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఇటు వంటి ఘటనలకు కారకులైన వారిని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యారినులు తమను తాము రక్షించుకునేందుకు, లైగింక వేధింపుల నుంచి కాపాడుకు నేందుకు ఆత్మస్థైర్యంతో ఎదుర్కొ నేందుకు సన్నద్ధులు కావాలని సూచించారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు అమూల్య మాట్లాడుతూ బాలికల రక్షణకు ఉన్న చట్టాలను గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో గుత్తల హైమావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని లూటుకుర్రు పిహెచ్‌సి పరిధిలో కొమరాడ నందు వైద్యాధికారిణి కె.సత్యవతి ఆదేశాల మేరకు బుధవారం దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టామని హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమం పంచాయతీ సెక్రెట్రీ ఎస్.నాగమణి, సర్పంచ్ వలవల సత్యవేణి, సత్యమూర్తి, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారని అన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న జెఇ రవికుమార్

జాబ్ కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

జాబ్ కార్డు ఉన్న ఉపాధి హామీ కూలీలు ప్రతీ ఒక్కరు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని సర్పంచ్ దాయం కావేరి, ఎన్ఆర్‌ఇజిఎస్ జెఇ రవికుమార్ అన్నారు. బుధవారం కాలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద బుధవారం గ్రామ సర్పంచ్ దాయం కావేరి అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ గ్రామ సభల్లో 2026 -2027 ఆర్థిక సంవత్సరం సంబంధించి గ్రామంలో గుర్తించిన ఉపాధి హామీ పనుల నివేదికను ఫీల్డ్ అసిస్టెంట్ కె.క్రాంతి కుమార్ గ్రామ సభలో చదివి వినిపించారు. ఎన్ఆర్‌ఇజిఎస్ జెఇ రవికుమార్ మాట్లాడు తూ ఉపాధి హామీ చట్టంలో జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరూ ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్‌లో తప్పనిసరిగా ఇకెవైసి చేయించు కోవాలని అన్నారు. కాలేరు గ్రామంలో 55 పనులను గుర్తించినట్లు తెలి పారు. ఈ పనుల వివరాల నివేదికను ఉన్నతా ధికారులకు తెలియజేయునట్లు జెఇ రవి కుమార్ తెలిపారు. గ్రామ సభలో గ్రామ సర్పంచ్ దాయం కావేరి, గ్రామ కార్యదర్శి యు.సుప్రియ, దాయం శేఖర్ బాబు, పెయ్యల యాకోబు, ఫీల్డ్ అసిస్టెంట్ కె.క్రాంతి కుమార్, మేట్లు, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందలేదని బాధితుల ఆవేదన

- విఆర్ఒ కుమారుడు జాబితా తయారుచేయడంపై ఆగ్రహం
- 50 కుటుంబాలకు దక్కని సాయం

ప్రజాశకి - అయినవిల్లి

విఆర్ఒ కుమారుడి నిర్లక్ష్య వైఖరి వల్లే నష్టపోయామని మండలంలోని వెలువలపల్లి గ్రామానికి చెందిన మొంథా బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మొంథా తుపాను కారణ ంగా నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన నష్ట పరిహారం అందకుండా పోవటానికి అతనే కారణం అయ్యాడని వారంతా ఆరోపించారు. ఈ విషయమై స్థానిక సచివాలయం వద్ద ఉన్న విఆర్ఒ వద్దకు అధిక సంఖ్యలో బాధితులు వెళ్లి ఆయనను ప్రశ్నించారు. పూరిగుడిసెలల్లో ఉంటున్న తమ పేర్లు రాయకపోవడానికి కారణం ఏంటని అడిగారు. సుమారు 50 కుటుంబాలకు మీ వల్ల, మీ కుమారుడి వల్ల అన్యాయం జరిగిందని ఆరోపించారు. నా ఆరోగ్యం బాగాలేని కారణంగా నా కుమారుడితో జాబితా తయారు చేయించానని విఆర్ఒ ఇచ్చిన వివరణతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఆరోగ్యం బాగోకపోతే మరొక విఆర్ఒతో ఆ పనిచేయించాలని కాని నిబంధనలకు విరుద్ధంగా మీ కుమారుడుని ఈ పనికి ఎవరు అనుమతించారని వారు ప్రశ్నించారు. స్థానిక తహశీల్దార్‌కు నా పరిస్థితిని తెలియజేశానని, ఆయన అంగీకరించాకే నా కుమారుడుతో జాబితా తయారు చేయించానని వివరణ ఇచ్చారు. జరిగిన పొర పాటుకు తనను మన్నించాలని విఆర్ఒ బాధితులను కోరారు. అయితే తమకు జరిగిన నష్టాన్ని ఎవరుభర్తీ చేస్తారని బాధితులు విఆర్ఒను ప్రశ్నించారు. కార్యక్రమంలో అందే సత్యనారాయణ, నిల్లా సూరిబాబు, మేడిశెట్టి నాగబాబు, బొంతు శ్రీనివాస్, దోనిపాటి సత్య ప్రసాద్, ముత్యాల భాగ్యలక్ష్మి, నూకపెయ్యి సరస్వతి, మోత వెంకటేశ్వరరవు తదితరులు పాల్గొన్నారు.



వెలువలపల్లి సచివాలయం వద్ద విఆర్ఒను నిలదీస్తున్న గ్రామస్తులు

జగన్నాటకాలు ఆపండి

మీడియా సమావేశంలో మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

జగన్నాటకాలు ఆపాలని, జగన్ ఆడే ఈ నాటకాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం రామచంద్రపురంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను వేళ అన్నదాతలు పుట్టెడు కష్టంలో ఉంటే, పరామర్శ పేరుతో జగన్ జేజేలు కొట్టిం చుకుంటున్నారని, పూలు చల్లించుకుంటూ బల ప్రదర్శన చేస్తున్నారని విమర్శించారు. జె బ్రాండ్‌కు తోడు జోగి రమేష్ బ్రాండ్ తోడైందని ఎద్దేవా చేశారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో ఆటలాడుకున్నారన్నారు. సిట్ అధికారులు పక్కా ఆధారాలతోనే జోగి రమేష్‌ను అరెస్టు చేశారన్నారు. మరోపక్క జగన్ తన వికృత చేష్టలతో మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో చంద్రబాబు, లోకేష్ శ్రమిస్తుంటే, జగన్ మాత్రం ఆరోపణలు చేసే పనిలో ఉన్నారన్నారు. నిజా యతీ పాలనకు ప్రజలు అండగా ఉన్నారన్నారు. అబద్ధపు రాజకీయాలు చేసే జగన్ కాలం ముగిసిందన్నారు. నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దింపిన ఘనత జగన్‌దేనన్నారు. తుపాను సమయంలో జగన్ పార్టీ బాధితులకు ఒక్క వాటర్ ప్యాకెట్ కూడా పంపలేదని గుర్తు చేశారు. జగన్ అండ చూసుకుని మాజీ మంత్రి జోగి రమేష్ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కల్తీ మద్యం కేసులో పూర్తి ఆధారాలతో జోగిరెడ్డి అతని సోదరుడు రామును పోలీసులు అరెస్టు చేశారన్నారు. అవినీతి చేసి బిసి కులం పేరు వాడకుకోవడం సిగ్గుచేటన్నారు. ఇకైనా డ్రామాలను కట్టి పెట్టాలని, లేకుంటే ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సుభాష్



దాతకు స్వామివారి చిత్రపటం అందజేత

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

రాజోలుకు చెందిన కట్టా ఉమా వెంకట దుర్గాశివకుమార్, లావణ్య దంపతులు, వారి కుటుంబసభ్యులు అప్పన పల్లి శ్రీ బాల బాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు బుధవారం రూ.10వేలు విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. ముందుగా దాతలు స్వామి వారిని దర్శించుకున్నారని అన్నారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వ చనం, శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

సర్పంచ్ ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు

ప్రజాశక్తి - అయినవిల్లి

వీరవల్లిపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు మొంథా తుపాను కారణంగా భారీ వర్షాలు నేపథ్యంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గ్రామాల్లో ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ పనులు నిర్వహించి బ్లీచింగ్ చల్లించి మురుగునీరు దిగువకు మళ్లింపు చర్యలు చేపట్టామన్నారు. మురుగుకుంటలలో ఎబెట్ స్ప్రే చేయించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగా హన కల్పించినట్లు సర్పంచ్ అయిన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.బులివీరన్న, పంచాయతీ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి విద్యార్థి కోటుం కుమార్ చందు శ్రీధర్ ఇటీవల రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఇటీవల నిర్వహించిన అండర్-14 బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీల్లో మేడిచర్ల రిత్విక విజయం సాధించిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. త్వరలో విజయవాడ గన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ఇద్దరి విద్యార్థులను డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ మలిశెట్టి వీరాస్వామి, ఆరో వార్డు కౌన్సిలర్ పిండి అమరావతి, పాఠశాల హెచ్‌ఎం కె.గణ సత్యనారాయణ, ఉపాధ్యాయులు బిఎస్.వెంకటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, వి.రేఖ, కెవి.సత్యనారాయణ, ఎం.చంద్రమోహన్, వసంత, వర్మ, పల్లాలమ్మ దేవివ. మట్టపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ షేక్ సలీం బాషా

తోరాటి జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

తోరాటి లక్ష్మణమూర్తి జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. తోరాటి 99వ జయంతిని తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విద్యా కమిటీ ఛైర్మన్ గంగుమళ్ల జానకిరాముడు, సామాజిక కార్యకర్తలు డివి.రాఘవులు, పెద్దింశెట్టి లెనిన్‌బాబు, హెచ్‌ఎం ఎస్‌వి.నాగరాజు తదితరులు మాట్లాడారు. నేటి యువత తోరాటి లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం 'సామాజిక సమస్యలు - విద్యార్థుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. బి.నందిని ప్రథమ, సిహెచ్.ప్రశాంతి, జి.ఖండితసాయి తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.జాన్, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ముఖ్యఅతిథులు

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని వినతి

ప్రజాశక్తి - పి.గన్నవరం

మంగళగిరిలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను వాడ్రేవుపల్లికి చెందిన టిడిపి యువ నాయకులు కోళ్ల సాయితేజ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఇచ్చిన జ్యాబ్ క్యాలెండర్ హామీని విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ విషయమై స్పందించిన నారా లోకేష్ 2026 జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. దీనిపై ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, నిరుద్యోగులు ఎవరూ అధైర్యపడవద్దని మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారని సాయితేజ పేర్కొన్నారు.



మంగళగిరిలో మంత్రి లోకేష్‌ను టిడిపి యువ నాయకులు సాయి

జనార్ధన స్వామిని దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్ దంపతులు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలో శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయానికి అయినవిల్లి, అప్పన్నపల్లి దేవస్థానాల అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్య నారాయణరాజు, హైమా పార్వతి దంపతులు బుధవారం విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఆలయ అర్చకులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

కార్టూ'నిజం'



రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు దీప్తి డిగ్రీ మరియు జూనియర్ కళాశాల జాతీయ సేవ పథకం విద్యార్థులు ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా 6వ రోజు కొమరాడ మరియు మాకనపాలెం గ్రామాలలో రోడ్ సేఫ్టీ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ పొందుటకు హెల్మెట్ యొక్క అవసరాన్ని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రెండు గ్రామాల్లోనూ విద్యార్థులు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎ.ఈశ్వరరావు, పి.సుబ్బారావు, వి.నాగరాజు, వి.కొండలరావు, పంచాయతీ కార్యదర్శులు యస్.నాగమణి, డి.సురేష్ మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దీప్తి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గోదావరికి పున్నమి హారతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయంలో గోదావరి నదికి కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పున్నమి హారతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది యాత్రికులు పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి అల్లు వెంకట దుర్గాభవాని, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పున్నమి హారతి ఇస్తున్న అర్చకులు

ఫ్లయ్ ఓవర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఆలమూరు

ఫ్లయ్ ఓవర్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. 216 ఎ జాతీయ రహదారిపై ఎన్నో ఏళ్ల నుంచి నత్తనడకన నిర్మాణ పనులు సాగదీస్తూ మండలంలోని జొన్నాడ ఫ్లయ్ ఓవర్ నిర్మాణం నిలిచిన విషయం విధితమే. దీనిపై సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కాంట్రాక్టర్లతోను, హైవే అధికారులతోను సమీక్ష నిర్వహిం చి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌డిఒ పి.శ్రీకర్ పరిస్థితిని పరిశీలించి గుత్తేదా రులకు ఫ్లయ్ ఓవర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దీనిపై బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆర్‌డిఒ పి.శ్రీకరతో కలిసి విచ్చేసి జొన్నాడ ఫ్లైయ్ ఓవర్ వద్ద హైవే అధికారులు, గుత్తేదారులతో క్షేత్రస్థాయిలో సర్వీస్ రోడ్లు ఫ్లయ్ ఓవర్ నిర్మాణం పరిశీలించారు. ఇప్పటికే ఆర్‌డిఒ పరిశీలించి సమీక్షలో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారని, వాటిని తూచా తప్పకుండా గుత్తేదారులు పాటిస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతిరోజు నిర్మాణ పురోగతి వివరాలు తన వాట్సాప్‌కు సమాచారం చేరవేయాలని సూచిం చారు. ఈ సందర్భంగా అయన విలేకరుల తో మాట్లాడుతూ ఇటీవల సిఎం చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఈ విషయంపై వారి దృష్టికి తీసుకుని వెళ్లామన్నారు. దీనిపై గుత్తేదారుపై చర్యలు తీసుకుంటూ ఎలాంటి లీగల్ సమస్యలకు తావు లేకుండా మళ్లి టెండర్లు పిలిచి నూతన కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించడానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. పాత కాంట్రాక్ట్ ద్వారా ఈ ఫ్లయ్ ఓవర్ ఫిల్లర్స్ ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. ఇప్పుడు నూతన టెండర్ల విధానం ద్వారా పనులు వేగవంతంగా చేయాలని ఆదేశిస్తూనే, ముందుగా ప్రయాణికులకు అనువుగా సర్వీస్ రోడ్డును పటిష్టంగా నిర్మించి పూర్తి చేయాలన్నారు. అలాగే 2026 ఫిబ్రవరి నెలాఖరుకు ఫ్లయ్ ఓవర్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులకు, గుత్తేదారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, ఆర్ఐ రమాయమ్మ, కాంట్రాక్టర్ ఇంజినీర్లు రామకృష్ణ, నరేంద్ర, ఎన్హైచ్ అధికారులు, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.



హైవే అధికారులకు, గుత్తేదారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలోని శ్రీరామ హోటల్ వద్ద బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బుధవారం పెరవలి మండలం కానూరుకు చెందిన ఆరుట్ల సూర్య నారాయణ(58) బైకుపై వెళ్తున్నాడు. ఆయన ఉండ్రాజవరం శ్రీరామ హోటల చెంతకు చేరే సరికి తణుకు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి.రవికుమార్ మాట్లాడారు. హెల్మెట్ లేకపోవడం వల్లే సూర్యనారాయణ మృతి చెందారన్నారు. హెల్మెట్ ధరించి ఉంటే స్వల్ప గాయాలతో బయటపడేవాడన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని ఆయన కోరారు.

చోరీ కేసులో రిమాండ్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో మిల్క్ పార్లర్ ఏజెన్సీ షాపులో రూ.45వేలను అపహరించిన కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వీరిలో ముగ్గురు మైనర్లు ఉన్నారని ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చేబ్రోలులో చల్లా చినబాబు మిల్క్ పార్లర్స్ ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. నవంబర్ 1న ఇద్దరు మైనర్లు ఆయన షాపు వద్దకు వచ్చారు. ఒక మైనర్ అతన్ని మాటల్లో పెట్టగా మరొక బాలుడు కౌంటర్‌లో ఉన్న రూ.45వేలను తస్కరించాడు. అనంతరం అక్కడే మరో ఇద్దరు రెండు బైకులపై సిద్ధంగా ఉన్నారు. ఈ డబ్బును తీసుకుని నలుగురూ అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై షాపు యజమాని చినబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గుబ్బల దయానందరావు, మరో ముగ్గురు మైనర్లను నిందితులుగా గుర్తించారు. బుధవారం వారిని జాతీయరహదారిలోని చెందుర్తి జంక్షన్ వద్ద అరెస్టు చేశారు. వారిని కోర్టు ముందు హాజరుపరిచారు. దయానందరావుకు రిమాండ్ విధించారు. మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించారని ఎస్ఐ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పి వరదరాజన్

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి - యానాం

భార్య హత్య కేసులో భర్తను యానాం పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పి వరదరాజన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. గుత్తెనదీవికి చెందిన పెమ్మాడి నాని, యానాంకు చెందిన దీనను ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఆరేళ్ల కుమార్తె ఉంది. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో యానాంకు కాపురానికి వచ్చారు. ఇక్కడికి వచ్చిన తరువాత నాని మద్యానికి బానిసై భార్యను మరింత వేధింపులకు గురిచేశాడు. భర్త వేధింపులు తాళలేక దీనా నాలుగు నెలల క్రితం బల్లావారి వీధిలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటుంది. విడాకుల కోసం యానాం కోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 3న నాని దీనా ఇంటికి వచ్చి గొడవపడ్డాడు. ఆమెను తీవ్రంగా కొట్టి గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె మృతదేహాన్ని కుమార్తె వద్ద ఉంచి పరారయ్యడు. తల్లి లేవకపోవడంతో బాలిక స్థానికులకు తెలిపింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. నిందితుని బుధవరం గుత్తెనదీవిలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచామని ఎస్పి తెలిపారు. ఎస్పి వెంట ఎస్ఐలు పుణీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, క్రైం టీమ్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

కాపవరం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రెల్లిపేటకు చెందిన ఆరుగురు యువకులు మోటారు సైకిళ్లపై ఐ.పంగిడి వెళ్లి తిరిగి వస్తుండగా కాపవరం సమీపంలో ప్రాథమిక పరిశీలనలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టుకున్నట్లు గుర్తించామన్నార. ఈ ప్రమాదంలో అల్లం గణేష్(21) మృతి చెందగా, మీసాల పరుశురాం, లోకేష్ తీవ్రంగా గాయపడ్డారని ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతుడు రాజ మహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. క్షతగాత్రులను రాజమహేంద్రవ రంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.



బాలిక రంజిత తల్లితో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం: మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో సంచలనం సృష్టించిన బాలిక రంజిత ఆత్మహత్య సంఘటనపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారు. ఈ మేరకు బుధవారం ఏరియా ఆసుపత్రిలో మృతురాలి తల్లిని పరామర్శించారు. బాధిత కుటుంబానికి తప్పకుండా న్యాయంచేస్తామన్నారు. బాలిక మృతిపై సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. నిందితులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. మెడికల్ రిపోర్టులు, ఫోరెనిక్స్ రిపోర్టు నివేదికలు వచ్చిన తర్వాత వాస్తవాలు తెలుస్తాయన్నారు. వాటిని వీలైనంత త్వరగా రప్పించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇటు వంటి సంఘటనపై తక్షణం జరగడం బాధాకరమని ఐదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకునేందుకు కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారని మంత్రి తెలియజేశారు. ప్రభుత్వం ఇటువంటి సంఘటనపై తక్షణం చర్యలు చేపడుతుందని ఆయన విలేకరులకు తెలిపారు.

ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి

అయిదో తరగతి విద్యార్థిని చిర్రా రంజిత మృతిపై సమగ్ర దర్యాప్తుచేయాలని ప్రజాసంఘాల డిమండ్ చేశాయి. దీనిపై పిడిఎస్‌యు, ఎఐకెఎంఎస్, ఐఎఫ్‌టియు ప్రజా సంఘాల తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. బుధవారం పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి బి.సిద్ధు, నాయకులు వెంటపల్లి భీమశంకరం తదితరులు ఆసుపత్రిలో విద్యార్థిని మృతదేహాన్ని సందర్శించి, మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. రంజిత మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయిని, వారు ఉంటున్న అద్దె ఇంటి ఓనర్ కుమారుడిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఆయనపై మాకు అనుమానం ఉందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారని అన్నారు. అతనిపై దర్యాప్తు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి, పిడిఎస్‌యు నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు దాణా పంపిణీ

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మండలంలోని మొంథా తుపాను ప్రభావానికి గురైన గ్రామాల్లో పశువుల దాణాను పాడి రైతులకు బుధవారం పంపిణీచేశారు. కేశవదాసుపాలెం పశువైద్యశాల వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ బిబి.సంపత్‌కుమార్, డాక్టర్ పివి.సురేష్‌లు పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన 50 శాతం సబ్సిడి దాణాను అర్హులైన రైతులకు అందజేశారున. కేశవదాసుపాలెం, అంతర్వేది కర, అంతర్వేది దేవస్థానం, అంతర్వేది పల్లిపాలెం గ్రామాల్లో 10 టన్నుల పశువుల దాణాను పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో కేశవదాసుపాలెం జనసేన నాయకులు అంజి, వై.తాతాజీ, నాయకులు బి.జానకి రామారావు, ఎన్.శ్రీను, రైతులు పాల్గొన్నారు.

35 పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలని ఓదురు గ్రామంలో రైతు సేవా కేంద్రం నందు రాష్ట్రో పశు సంవర్ధక శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పశుఆరోగ్యశిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ వింజుమల్ల శ్రీనివాస్‌కుమారి దీనిని ప్రారంభించారు. అనంతరం ఏరియా పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఒ.రామకృష్ణ రైతులక ఈ శిబిరం గురించి వివరించారు. అనంతరం 35 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి, 45పశువులకు డివార్మింగ్ మందు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల పశువైద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

మూడు కేజీల వెండి ఆభరణాల బహూకరణ

ప్రజాశక్తి - కొత్తపేట

మందేశ్వర స్వామికి 3.18 కేజీల జుటాజుటాన్ని కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామ పెద్దలు, యాత్రికులు , దేవస్థానం, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చక స్వాములు, వేదపండితుల సమక్షంలో ప్రొద్దుటూరుకు చెందిన చిన్నె శ్రీనివాస్, లక్ష్మి దంపతులు బుధవారం బహూకరించారని సహాయ కమిషనర్, ఇఒ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, మందపల్లి ఎంపిటిసి సభ్యుడు వీర వెంకట సత్యనారాయణ, ఉప సర్పంచ్ గ్రంధి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని మారేడుబాకలో మహిళా శక్తి భవన నిర్మాణానికి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దేవరకొండ అఖిల, తహశీల్దార్ తేజేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ జయచంద్రగాంధీ, పంచాయతీ రాజ్ ఎస్ఇ పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్ధార్థ స్కూల్ లో చెకుముఖి టాలెంట్ విజేతలకు అభినందన

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని జొన్నాడ జడ్‌పి హైస్కూల్ నందు మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో మండల కేంద్రంలోని శ్రీ సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారని సిద్ధార్థ అధినేత కె.ముల్లారావు బుధవారం తెలిపారు. అలాగే ముందుగా ఈ పాఠశాలలో నిర్వహించిన పోటీలో మండల స్థాయికి 9వ తరగతి విద్యార్థులు వై.యశ్వంత్ కృష్ణ, వి.శంకర్ నారాయణ, 10వ తరగతి విద్యార్థి కె.చరీష్ జై సూర్య ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరంతా మండల స్థాయిలో నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి సాధించడం గర్వకారణమని ముల్లారావు కొనియాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో విజేతలైన విద్యార్థులను అభినందించారు. జిల్లా స్థాయిలో జరగబోయే పోటీల్లో కూడా ప్రతిభ కనబరచాలన్నారు. దీంతో పాఠశాలకు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షను వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ గుణశేఖర్, జెస్సినా, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



మంత్రి లోకేష్‌తో శ్రీనివాసరావు

లోకేష్‌ను కలిసిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అంబాజీపేట

రాష్ట్ర టిడిపి ఎస్‌సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిపై లోకేష్ ఆరా తీశారని, పార్టీ సంబంధించిన పలు అంశాలపై చర్చించారని శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 20 నిమిషాల పాటు లోకేష్‌తో మాట్లాడానని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని అనేక అభివృద్ధి పనుల గురించి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. గత 30 ఏళ్ల నుంచి టిడిపి విజయమే లక్ష్యంగా కష్టపడుతున్న తనకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇప్పించాలని లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. పార్టీ కోసం శ్రమిస్తున్న సీనియర్ నాయకులకు గుర్తింపు ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారని శ్రీనివాసరావు తెలిపారు.

ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

సిబ్బంది లేకపోవడంతో మండలంలోని పలు సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పనుల కోసం సచివాలయాలకు వెళ్లిన ప్రజలు నిరాశతో వెనుదిరాగాల్సి వస్తుంది. బుధవారం దొండపూడి సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం పలువురు గ్రామస్తులు వచ్చారు. సిబ్బంది లేకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. వారు మాట్లాడుతూ సచివాలయంలో ఇద్దరు ఇన్‌ఛార్జులు మాత్రమే ఉన్నారని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎం, అగ్రికల్చర్, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారన్నారు. అందులో ఇద్దరు ఫీల్డ్ వర్క్ అంటూ బయటకు వెళ్లిపోయారని తెలిపారు. మరొకరు మధ్యాహ్నం దొండపూడి సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం పలువురు గ్రామస్తులు వచ్చారు. సిబ్బంది లేకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. వారు మాట్లాడుతూ సచివాలయంలో ఇద్దరు ఇన్‌ఛార్జులు మాత్రమే ఉన్నారని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎం, అగ్రికల్చర్, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారన్నారు. అందులో ఇద్దరు ఫీల్డ్ వర్క్ అంటూ బయటకు వెళ్లిపోయారని తెలిపారు. మరొకరు మధ్యాహ్నం భోజనానికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. వారికి ఫోన్ చేసి అడిగితే సర్వే చేస్తున్నామంటూ, మండల కార్యాలయాలయ వెళ్లామంటూ చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఎప్పుడు వచ్చినా ఖాళీ కుర్చేలే దర్శనమిస్తున్నాయని తెలిపారు. గతంలో పనుల కోసం మండల కార్యాలయాలకు వెళ్లకుండా సచివాలయాలకు వెళ్తే సరిపోయేదని, ఇప్పుడు సిబ్బందిని బయట పనులకు పంపించేయడంతో తమ పనులు జరగ్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బందిని సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలని కోరతున్నారు.



దొండపూడి సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఖాళీగా కుర్చీలు

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - మండపేట

మండంలోని కేశవరానికి చెందిన పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. కేశవరం గ్రామ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో కేశవరం పంచాయతీ 6వ వార్డు సభ్యులు గండుమేను గోవిందు, ఫిషర్‌మెన్ సొసైటీ మాజీ అధ్యక్షులు చుక్కా అచ్చారావు, వారి అనుచరులు కొల్లి గంగారావు, పురంశ్రీను, జి.శ్రీవి తదితరులు పార్టీలో చేరారు. మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో వారు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎంఎల్‌ఎ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కర్రి తాతారావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు ఉండమట్ల సురేష్, ఎంపిపి ఉండమట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇందుపల్లి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - అమలాపురంరూరల్

అమలాపురం మండలం ఇందుపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని తూటారపు వివి.వర్షిని రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయురాలు లంక రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ విద్యార్థిని వర్షిని ఇటీవల జల్లా స్థాయి సెపక్ తక్రా పోటీల్లో విజేతగా నిలిచిందన్నారు. ఈ నెల 6,7,8 తేదీల్లో ఉభయ గోదావరి జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ దేవరపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీల్లో వర్షిని పాల్గొంటుందని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాలిని, అప్పాజి, ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయలు తదితరులు అభినందించారు.

పర్యాటకాభివృద్ధిపై ప్రతిపాదనలకు ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.వెంకటచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక ప్రోత్సాహం కోసం జలక్రీడలు, సాహస క్రీడలు, లగ్జరీ హౌస్ బోట్లు, పార్టీ బోట్ల వంటి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు, వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చననీ అన్నారు. రాజమహేంద్రవరం గోదావరి పరిసర ప్రాంతాలు, కొవ్వూరు వైపు, ధవళేశ్వరం-వేమగిరి మార్గం, అలాగే నిడదవోలు కాలువ ప్రాంతంలో చేపట్టేందుకు ప్రతిపాదనలు స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలను www.tourism.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని, అలాగే 9505011951/6309942025 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం, కోరుకొండ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ జెపిబి.నటరాజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సీతానగరం మండలంలోని ముగ్గళ్ల స్టేషన్ పరిధిలో హెటి ఎల్‌టి లైన్ లిఫ్టింగ్ పనుల రీత్యా రఘుదేవపురం, కోరుకొండ మండలం నల్లగొండ, కోటి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాత్రికులతో పోటెత్తిన గోష్పాదక్షేత్రం

ప్రజాశక్తి - కొవ్వూరు

కార్తీక పౌర్ణమి సందర్భంగా కొవ్వూరు గోష్పాద క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం తెల్లవారు జామునే యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోదావరిలో స్నానాలు ఆచరించారు

శాఖల వారీగా ప్రతిపాదనలు ఇవ్వండి

ప్రజాశక్తి - కొవ్వూరు

నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి శాఖల వారీగా ప్రతిపాదనలు రూపొందించాలని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీరాజ్ రోడ్లు, గ్రామల్లో సిసి రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ ట్యాంక్‌లు అవసరమైన చోట నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలని అన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు అవసరమైన స్కూల్స్ నుంచి ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారి యువతకు రుణాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు రాయితీపై రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా షెడ్యూల్ కులముల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి షెడ్యూల్డ్ కులముల ఆర్థిక సహకార సంఘం లిమిటెడ్ జిల్లాకు మంజూరు చేసిన 3000 లీటర్ల సామర్థ్యం గల వాహనాలలో, రుణం చెల్లించడంలో విఫలమైన లబ్ధిదారులకు సంబంధించిన రెండు వాహనాలు షరతుల మేరకు తిరిగి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆశక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను కాకినాడలోని ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 6281817023ను సంప్రదించాలన్నారు.

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ఇన్‌ఛార్జ్ డిఇ ఎవి.రామారావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి సుముఖంగా లేకపోతే ఇప్పటి వరకూ తీసుకున్న డబ్బులను ఆర్‌టిజిఎస్ ద్వారా ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని స్పష్టం చేశారు. నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారుల నుంచి నిధులను రికవరీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ సమా వేశంలో ఎంపిడిఒ భారతి, డిప్యూటీ ఎంపిడిఒ మూర్తి పాల్గొన్నారు.